
# రహస్యాల పేట.... పుతిన్ ఉండే రాజ కోట!



రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ అంటేనే ఒక అంతుచిక్కని రహస్యం.. ఆయన వ్యూహాలే కాదు.. ఆయన నివసించే భవనాలు కూడా అంతే మిస్టరీగా ఉంటాయి. ఇటీవల రష్యాలోని పుతిన్ నివాసాలపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు యత్నించిందన్న వార్తల నేపథ్యంలో క్రెమ్లిన్ అధినేతకు ఉన్న అధికారిక, అనధికారిక నివాసాల గురించి ప్రపంచవ్యాప్తంగా మరోసారి చర్చ మొదలైంది.

**ది క్రెమ్లిన్.. రష్యా అధికారిక శక్తి కేంద్రం...** మాస్కో నడిబొడ్డున ఉన్న 'క్రెమ్లిన్' రష్యా రాజకీయాలకు వెన్నెముక. ప్రపంచ దేశాల నేతలకు పుతిన్ ఇక్కడే ఆతిథ్యమిస్తారు. అయితే కట్టుదిట్టమైన భద్రత ఉండే ఈ కోటలో పుతిన్ రాత్రి వేళల్లో బస చేయడం చాలా అరుదు. ఇది కేవలం అధికారిక కార్యక్రమాలకు మాత్రమే పరిమితం.

**నోవో-ఒగర్యోవో : అసలైన కార్యాలయ నివాసం...** మాస్కో పశ్చిమ ప్రాంతంలో ఉండే ఈ భవనం.. పుతిన్ నిత్యం గడిపే ప్రధాన నివాసం. పాలనపరమైన నిరయాలు.. ఉన్నతాధికారులతో వీడియో కానారేన్స్ లు ఇక్కడి నుంచే జరుగుతాయి. దీని చుట్టూ గాలిలో కూడా రక్షణ కవచం ఉంటుందని చెబుతారు.

**వల్డాయ్ ఎస్టేట్ : విలాసాల హేమంతం..** సుమారు 250 హెక్టార్లలో విస్తరించిన ఈ ఎస్టేట్ ఒక ఆధునిక గ్రామం లాంటిది. 80 భవనాలు, మినీ కాసినో, సినిమా హాల్, గోల్ఫ్ కోర్స్ సహా ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇటీవల 91 డ్రోన్లతో ఉక్రెయిన్ ఇక్కడే దాడికి యత్నించిందని రష్యా ఆరోపించింది.

**గెలెండ్ జిక్ 'పుతిన్ ప్యాలెస్'.. బిలియన్ డాలర్ల మిస్టరీ...** నల్ల సముద్ర తీరాన ఉన్న ఈ ప్యాలెస్ పుతిన్ వ్యక్తిగత ఆస్తి అని అంతర్జాతీయ సంస్థలు ఆరోపిస్తున్నాయి. దీనివిలువ సుమారు ఒక బిలియన్ డాలర్లు. ఈ ప్రాంతంపై విమానాలు ఎగరడానికి వీల్లేని 'నో ఫ్లైజోన్' అమల్లో ఉంది. అయితే క్రెమ్లిన్ మాత్రం దీనికి పుతిన్ కు సంబంధం లేదని బుకాయిస్తోంది.

**బోచరోవ్ రుచేయ్ , కేప్ అయా.. వేసవి విడిదులు...** సోచీలోని బోచరోవ్ రుచేయ్ పుతిన్ వేసవి విడిది. అలాగే ఆక్రమిత క్రిమియాలోని కేప్ అయాలో కూడా అత్యంత విలాసవంతమైన ప్యాలెస్ ఉన్నట్లు సమాచారం. ఇక్కడ అత్యవసర సమయాల్లో తప్పించుకోవడానికి ప్రత్యేక సొరంగ మార్గాలు, భూగర్భ బంకర్లు ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. పుతిన్ నివాసాలు కేవలం విలాసానికి చిహ్నాలు మాత్రమే కాదు, రష్యా అత్యున్నత స్థాయి భద్రతా వ్యూహాలకు అవి నిదర్శనాలు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఈ 'రహస్య కోటల' చుట్టూ రక్షణను మాస్కో మరింత కట్టుదిట్టం చేసింది.

# పన్ను వసూళ్ల లెక్క చెప్పిన బ్యాంక్ ఆఫ్ బరోడా రీసెర్చ్




దేశం ఏదైనా.. దాని ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసేందుకు పన్ను ఆదాయం కీలకభూమిక పోషిస్తుందని చెప్పాలి. దీనికి సంబంధించి పలు దేశాలతో భారత్ లో వసూలవుతున్న పన్నులను పోల్చిన ఒక పరిశోధనకు సంబంధించిన వివరాలు తాజాగా వెల్లడయ్యాయి. పన్ను వసూళ్ల విషయంలో పలు డెవలప్ మెంట్ దేశాల్ని భారత్ వెనక్కి నెట్టినట్లుగా బ్యాంక్ ఆఫ్ బరోడా నిర్వహించిన రీసెర్చ్ లో గుర్తించారు. స్థూల దేశీయోత్పత్తి.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి పన్నుల ఆదాయ నిష్పత్తి ప్రస్తుతం 19.6 శాతానికి చేరినట్లుగా గుర్తించారు. పలు దేశాలతో పోలిస్తే మన దేశంలో పన్ను వసూళ్లు బాగున్నప్పటికి.. మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. పన్నుల వసూళ్లు పెరగటంలో కీలక భూమిక ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాత్మక సంస్కరణలేనని రిపోర్టు స్పష్టం చేస్తోంది. పన్ను ఎగవేతకు అడ్డుకట్ట వేయటంతో పాటు.. జీఎస్టీని సమర్థవంతంగా అమలు చేయటం.. డిజిటల్ లావాదేవీల్ని ప్రోత్సహించటంతో పన్ను వసూళ్లు పెరిగినట్లుగా తేల్చారు రానున్న రోజుల్లో పన్ను వసూళ్లు మరింత పెరగటం ఖాయమని రిపోర్టు చెబుతోంది. అంతేకాదు 2026 ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న నూతన ఆదాయ పన్ను చట్టం దేశ పన్నుల చరిత్రలో కీలక మలుపుగా మారుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. గతంతో పోలిస్తే పన్ను వసూళ్లలో పురోగతి సాధించినప్పటికి.. డెవలప్ మెంట్ దేశాలతో పోలిస్తే భారత్ ఇంకా వెనుకబడి ఉందని చెప్పినా.. పలు ఇతర దేశాలతో పోలిస్తే మాత్రం పరిస్థితి మెరుగ్గా ఉందన్న విషయాన్ని వెల్లడించింది. యూరోప్ లోని జర్మనీలో ట్యాక్స్ టు జీడీపీ రేషియో ఏకంగా 38 శాతం ఉంటే.. అగ్రరాజ్యం అమెరికాలో 25.6 శాతంగా ఉంది. వీటితో పోలిస్తే భారత్ లో 19.6 శాతంగా ఉన్నట్లుగా రిపోర్టు పేర్కొంది. భారతదేశ జనాభా.. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో ఈ అంతరం తగ్గుతుందని ఈ రిపోర్టు అంచనా వేసింది. అదే సమయంలో ఆసియాలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలుగా పేర్కొనే హాంకాంగ్.. మలేషియా.. ఇండోనేషియా లాంటి వర్థమాన దేశాలతో పోలిస్తే పన్ను వసూళ్లలో భారత్ మెరుగైన పని తీరు కనబరుస్తుందని చెబుతున్నారు. ఆసియాలోని వర్థమాన మార్కెట్లుగా చెప్పే హాంకాంగ్ లో పన్నువసూళ్లు 13.1 శాతంగా ఉంటే.. మలేషియాలోనూ 13.1 శాతం.. ఇండోనేషియాలో 12 శాతంతో పోలిస్తే భారత్ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా రిపోర్టు వెల్లడించింది. కరోనా వేళ పన్నుల ఆదాయం తగ్గినప్పటికీ.. ఆ తర్వాత భారత్ ఊహించిన దాని కంటే మిన్నగా పుంజుకున్నట్లుగా చెబుతున్నారు. ఏమైనా.. ఆర్థికంగా భారత్ మెరుగైన పని తీరును ప్రదర్శిస్తుందని మాత్రం చెప్పకతప్పదు. నిజానికి పన్ను వసూళ్లను మరింత సరళీకరిస్తే.. పన్ను రాబడులు మరింత పెరుగుతాయన్న మరో వాదన ఉంది. మరి.. దీనిపై ప్రభుత్వం ఫోకస్ చేయాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# జీఎస్టీ వసూళ్ళలో టాప్ గేర్

ఏపీలో ఇపుడు ఆర్ధికంగా సుస్థిరత్వం కనిపిస్తోంది. కీలకమైన విభాగాలలో తీసుకుని వచ్చిన సంస్కరణలు అలాగే ఆదాయ మార్గాలను పెంచడం పన్ను చెల్లింపులలో పూర్తిగా కట్టుదిట్టమైన వైఖరిని అనుసరించడం ద్వారా గతానికి కంటే కూడా జీఎస్టీ వసూళ్ళు ఎప్పటికపుడు పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది. అది ఆచరణలో కూడా బాగా కనిపిస్తోంది. నిజానికి ఎంతో సంక్లిష్టమైన పరిస్థితులు అయితే ఇపుడు ఉన్నాయి. అయినా సరే మొక్కవోని దీక్షతో ఏపీ ప్రభుత్వం జీఎస్టీ వసూళ్ళలో టాప్ గేర్ లో నిలవడం అన్నది గ్రేట్ అని అంటున్నారు.

**జిఎస్‌టి సంస్కరణల నేపథ్యం :** దేశవ్యాప్తంగా ఈ ఏడాది అక్టోబర్ నుంచి జిఎస్‌టి సంస్కరణలు అమలు చేశారు. దాని వల్ల సూపర్ ఆదా అంటూ మధ్యతరగతి దిగువ మధ్యతరగతి అల్పాదాయ వర్గాలకు ఎంతో మేలు చెశారు. అదే సమయంలో సవరించిన స్లాబ్ ల కారణంగా చాలా రాష్ట్రాలకు ఎంతో ఇబ్బంది కలిగింది. ఆర్ధికంగా కూడా ఆయా రాష్ట్రాలు నష్టపోయే పరిస్థితి వచ్చింది. అందులో ఏపీ కూడా ఉంది. ఏకంగా ఎనిమిది వేల కోట్ల రూపాయల దాకా ఏపీ ఏటా భారీ కోతను జిఎస్‌టి సంస్కరణలు కారణంగా చవి చూడాల్సి వచ్చింది.




ఆ ప్రభావం మరుసటి నెల నవంబర్ మీద ఎంతో కొంత పడినా డిసెంబర్ వచ్చేసరికి మాత్రం ఏపీ బాగానే కోలుకుని తన ఆర్థిక స్థిరత్వాన్ని నిలబెట్టుకుంది.

**ముందు వరసలో :** ఏపీలో చూస్తే కనుక జిఎస్‌టి వసూళ్ళలో ముందు వరసలో ఉంది అని అధికారులు చెబుతున్నారు. అంతే కాదు జిఎస్‌టి దేశంలో అమలు చేసిన 2017 నుంచి ఇప్పటిదాకా చూస్తే ఏ డిసెంబర్ నెలలో రాని విధంగా ఈసారి జిఎస్‌టి వసూళ్ళు ఏపీకి దక్కాయి అని చెప్పాల్సి ఉంది అని అధికారులు వివరించారు. ఇక 2024 డిసెంబర్ నెలలో చూస్తే జిఎస్‌టి వసూళ్ళతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలంగా మారిందని వివరిస్తున్నారు. నిజానికి చూస్తే అనేక సవాళ్ళు కూడా ఏపీకి ఈ సమయంలో ఎదురయ్యాయి. వాటిని కూడా తట్టుకుని ఏపీలో మంచి స్థాయిలో జిఎస్‌టి వసూళ్లు రావడం పట్ల అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఇదీ లెక్క :** ఇక చూస్తే ఏపీలో 2025 డిసెంబర్ నెలలో ఏకంగా జిఎస్‌టి వసూళ్ళు నికర ఆదాయం రెండు వేల 652 కోట్ల రూపాయలుగా ఉంది. ఇది టోటల్ గా గత తొమ్మిదేళ్ళ కాలంలో డిసెంబర్ నెలలో వచ్చిన రికార్డు స్థాయి వసూళ్ళు అని చెబుతున్నారు ఇక 2024 డిసెంబర్ నెల జిఎస్‌టి వసూళ్ళతో పోలిస్తే ఈ ఏడాది ఏకంగా 5.78 వృద్ధి ని నమోదు చేయడం కూడా విశేష పరిణామంగా అధికారులు చెబుతున్నారు. అంతే కాదు, ఈ వసూళ్ళ శాతం జాతీయ సగటుతో పోల్చి చూసినపుడు 5.61 శాతం కంటే ఎంతో ఎక్కువగా ఉంది అని విశ్లేషిస్తున్నారు. క్రమబద్ధమైన ఆర్థిక స్థిరత్వానికి జిఎస్‌టి వసూళ్ళు ఒక సూచికంగా చెబుతున్నారు. ఇదే తీరున కొత్త ఏడాదిలో కూడా వసూళ్ళలో రికార్డు క్రియేట్ చేయడానికి ఏపీ కృషి చేస్తుందని అధికారులు నమ్మకంగా చెబుతున్నారు.

# అమెరికా పౌరుడిని పెళ్లి చేసుకుంటే గ్రీన్ కార్డ్ ఇక అంత ఈజీ కాదు!

అగ్రరాజ్యం అమెరికా అందరికీ కలల దేశం. అక్కడ ఉండాలని.. జాబులు చేయాలని.. డాలర్లు సంపాదించాలని ఎంతో కలలు కని ఉంటారు. అయితే ఇప్పుడు అక్కడ సెటిల్ అవ్వడం అంత ఈజీ కాదు.. అందుకే చాలా మంది అమెరికాలో సెటిల్ అయ్యేందుకు అమెరికా పౌరుడిని పెళ్లి చేసుకొని శాశ్వత నివాసిగా ఉండిపోవాలనుకుంటారు. అయితే ఇన్నాళ్లు సాగిన ఈ ఆట ఇప్పుడు ట్రంప్ సర్కార్ సాగనివ్వకుండా అడ్డుకట్టవేసింది. దశాబ్దాలుగా అమెరికా పౌరుడిని వివాహం చేసుకోవడం అనేది గ్రీన్ కార్డ్ పొందడానికి ఒక 'గోల్డెన్ గేట్'లా ఉండేది. కానీ 2026 నాటికి మారుతున్న రాజకీయ, చట్టపరమైన పరిస్థితులు ఈ మార్గాన్ని ముళ్ల బాటగా మారుస్తున్నాయి. డోనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని ప్రభుత్వం వలస విధానాలపై ఉక్కుపాదం మోపుతుండటమే దీనికి ప్రధాన కారణం. అమెరికాలో స్థిరపడాలనుకునే వారికి అత్యంత సులభమైన మార్గంగా భావించే 'వివాహ గ్రీన్ కార్డ్' ఇకపై అంత ఆశాజనకంగా ఉండకపోవచ్చు. అమెరికా ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ట్రంప్ ప్రభుత్వం మరింత కఠినతరం చేయడంతో పెళ్లి ద్వారా గ్రీన్ కార్డ్ పొందడం ఇప్పుడు ఒక సవాలుగా మారింది.

**కఠినతరం అవుతున్న నిబంధనలు.. కీలక మార్పులు ఇవే..** కేవలం గ్రీన్ కార్డ్ కోసమే చేసుకునే నకిలీ వివాహాలను అరికట్టడమే లక్ష్యంగా అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు ఎదుర్కోబోయే ప్రధాన సవాళ్లు ఉన్నాయి. దంపతుల మధ్య బంధం నిజమైనదని నిరూపించడానికి గతంలో కంటే




ఎక్కువ ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియకు అయ్యే ఖర్చు భారీగా పెరిగింది.. ఇది సామాన్య వలసదారులపై ఆర్థిక భారాన్ని మోపుతోంది. డాక్యుమెంట్లలో చిన్న తప్పు ఉన్నా లేదా అనుమానం వచ్చినా.. విచారణ పేరుతో ఏళ్ల తరబడి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచుతున్నారు.

**గణాంకాలు ఏం చెబుతున్నాయి?....** అమెరికా ఇమిగ్రేషన్ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2025లో వివాహ ఆధారిత పిటిషన్లపై రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్.ఎఫ్.ఈ) దాదాపు 15 శాతం పెరిగాయి. అంటే అధికారులు దరఖాస్తుదారులను మునుపటి కంటే ఎక్కువగా ప్రశ్నిస్తున్నారు.. అదనపు సాక్ష్యాధారాల కోసం వేధిస్తున్నారు. సాధారణంగా అమెరికా పౌరుల జీవిత భాగస్వాములకు వీసా కోటాతో సంబంధం లేకుండా ఇమిడియట్ రిలేటివ్ కేటగిరీలో ప్రాధాన్యత లభించేది. అయితే జనవరి 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్త వీసా కోటా సవరణల వల్ల ఈ కేటగిరీలో ఉన్న వారికి కూడా వేచి చూసే సమయం పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెళ్లి ద్వారా గ్రీన్ కార్డ్ పొందాలనుకునే వారు కేవలం కాగితాల మీద ఆధారపడకుండా ప్రతి చిన్న విషయాన్ని డాక్యుమెంట్ చేసుకోవాలి. చట్టపరమైన చిక్కులు రాకుండా నిపుణుల సలహాలు తీసుకోవడం ఉత్తమమని అంటున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా పౌరుడిని పెళ్లి చేసుకుంటే గ్రీన్ కార్డ్ ఖాయం అనే పాత సూత్రం ఇక పనికిరాదు. ట్రంప్ సర్కార్ తీసుకుంటున్న ఈ నిర?యాలు వేలాది మంది వలసదారుల కలలపై నీళ్లు చల్లుతున్నాయి. అమెరికాలో అడుగుపెట్టాలన్నా.. అక్కడ స్థిరపడాలన్నా ఇకపై నిజాయితీతో పాటు ఓపిక కూడా చాలా అవసరం.

# భర్త గలీజ్ బంధాన్ని గుట్టు రట్టు చేసిన భార్యకు చైనా కోర్టు షాకింగ్ శిక్ష

భర్త పెట్టుకున్న వివాహేతర సంబంధం గురించి సోషల్ మీడియాలో విమర్శలు చేసినందుకు ఆ ఇల్లాలికి ఊహించని షాక్ ఎదురైంది. ఆమె చేసిన పనిని తప్పు పట్టిన కోర్టు.. ఆమెకు వింత శిక్ష వేయటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. సదరు కోర్టు విధించిన శిక్ష ఇప్పుడు ప్రపంచంలోని పలు దేశాల్లో కొత్త చర్చకు తెర తీయటమే కాదు.. వాదనలు మొదలయ్యాయి. ఇంతలా అందరిని ప్రభావితం చేసిన సదరు కోర్టు ఏ దేశానికి చెందిందంటే.. మన పొరుగున ఉండే చైనా. ఆ దేశంలోని ఒక కోర్టు విధించిన శిక్ష ఇప్పుడు అందరూ మాట్లాడుకునేలా చేయటమే కాదు.. సోషల్ మీడియాలో సదరు భార్య వీడియోలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. అసలేం జరిగిందంటే.. చైనాలోని హెనాన్ ప్రావిన్స్ కు చెందిన నియు నా అనే మహిళకు గావో ఫీ అనే వ్యక్తితో పదేళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. గావో ఫీ ఒక బొగ్గు గని కంపెనీలో టీమ్ లీడ్ స్థానంలో ఉన్నాడు. అతనికి ఆఫీసులోని మరో వివాహితతో వివాహేతర సంబంధం మొదలైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న భార్య.. భర్తతో విబేధించింది. దీంతో.. వీరిద్దరి మధ్య ఈ విషయంలో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో సహనం కోల్పోయిన ఆమె తన భర్త తప్పుడు పనుల గురించి వివరిస్తూ.. అతడి బండారాన్ని బయటపెట్టింది.



తన భర్త పని చేసే ఆఫీసు వివరాలతో పాటు.. భర్తను తిడుతూ పోస్టులు పెట్టింది. ఈ నేపథ్యంలో తన భార్యపై భర్త గావో ఫీ పరువు నష్టం కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. అనూహ్య రీతిలో తీర్పు ఇవ్వటం గమనార్హం. ఒకరు వ్యక్తిగతంగా ఎన్ని తప్పులు చేసినా.. చట్టం ప్రకారం అతడి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగేలా వ్యవహరించే హక్కుఎవరికి ఉండదని స్పష్టం చేసిన కోర్టు.. తన భర్తకు సదరు మహిళ పదిహేను రోజుల పాటు సోషల్ మీడియా వేదికగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. దీంతో.. జనవరి 12 నుంచి భర్తను క్షమించమని కోరుతూ వరుసగా క్షమాపణలు చెబుతూ పోస్టులు పెట్టటం మొదలుపెట్టింది. కోర్టు ఆదేశాల్ని అమలు చేస్తూనే.. తన భర్తకు వ్యంగ్య రీతిలో సారీ చెబుతోంది. అంతేకాదు.. తనే భర్తతో వివాహేతర సంబంధాన్ని పెట్టుకున్న మహిళకు సైతం వ్యంగ్య రీతిలో చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నాయి. మీ ఇద్దరిది నిజమైన ప్రేమ అని పేర్కొంటూ.. "నువ్వు ఎన్ని తప్పులు చేసినా నీ గౌరవాన్ని నేను కాపాడాలి కాబట్టి నన్ను క్షమించు" అంటూ తనదైన రీతిలో సారీ చెప్పటం మొదలు పెట్టింది. దీంతో.. ఆమె వీడియోలువైరల్ అవుతున్నాయి. అంతేకాదు.. ఈ వింత తీర్పుతో సోషల్ మీడియాలో ఆమె ఫేమస్ అయిపోయారు. రోజుల వ్యవధిలోనే ఆమెకు 3.5 లక్షల మంది ఫాలోవర్లు పెరగటం గమనార్హం.

# ఫోన్ లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త.. ఫైన్ తెలిస్తే గుండె గుబేల్!

ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 3000 మందికి పైగా ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగా కన్నుమూస్తున్నారు. ఏడాదికి లక్షలాది కుటుంబాల్లో ఈ ప్రమాదాలు తీరని శోకాన్ని నింపుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనల పట్ల నిర్లక్ష్యమే ఈ మరణాలకు ప్రధాన కారణమని గణాంకాలు చెబుతున్నాయి. అయితే అరబ్ దేశమైన యూఏఈ ఈ పరిస్థితిని మార్చడానికి గట్టి చర్యలను తీసుకుంటుంది.

అత్యాధునిక సాంకేతికతను, కఠినమైన చట్టాలను జోడించి.. రహదారి భద్రతలో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోంది. బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ద్వారా మాత్రమే ప్రాణాలను కాపాడుకోగలమని అక్కడి నిబంధనలు హెచ్చరిస్తున్నాయి.

**అబుదాబీ కఠిన నిబంధనలు - ఏఐ నిఘా:** అబుదాబీలో ట్రాఫిక్ నిబంధనల అమలు అత్యంత పారదర్శకంగా, కఠినంగా ఉంటుంది. డ్రైవింగ్ చేస్తూ ఫోన్ వాడితే 800 దిర్హామ్‌ల (సుమారు రూ. 18,000)



భారీ జరిమానాతో పాటు బ్లాక్ పాయింట్లు విధిస్తారు. ఇక్కడ విశేషమేమిటంటే, రోడ్లపై ఉండే అత్యాధునిక ఏఐ కెమెరాలు డ్రైవర్ సీట్ బెల్ట్ పెట్టుకోకపోయినా లేదా ఫోన్ ఉపయోగిస్తున్నా క్షణాల్లో గుర్తించి ఆటోమేటిక్‌గా ఫైన్ వేస్తాయి. అయితే, డ్రైవర్ల సౌకర్యార్థం బ్లూటూత్ లేదా హెడ్?ఫోన్స్ వాడుకోవడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. ఒక డ్రైవర్‌కు 24 బ్లాక్ పాయింట్లు చేరితే వారి లైసెన్స్ శాశ్వతంగా రద్దవుతుంది, ఈ నిబంధనలు పాటించక తప్పని పరిస్థితిని కల్పిస్తోంది.

**మితిమీరిన వేగం - భారీ మూల్యం:** అతి వేగం క్షణ కాలపు ఆనందాన్ని ఇవ్వవచ్చు కానీ, అది జీవితకాలపు విషాదాన్ని మిగుల్చుతుంది. ఈ విషయాన్ని యూఏఈ ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. నిర్ణీత పరిమితి (80 కి.మీ) కంటే ఎక్కువ వేగంతో వాహనాన్ని నడిపితే ఏకంగా 3,000 దిర్హామ్‌ల మన కరెన్సీ లో (సుమారు రూ. 75,000) భారీ జరిమానా విధిస్తారు. ఇక ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్‌ను బేఖాతరు చేస్తూ ముందుకు వెళ్తే 1,000 దిర్హామ్‌ల ఫైన్‌తో పాటు, డ్రైవింగ్ హిస్టరీలో అక్కడ పాయింట్స్ వేస్తారు అవి ఒకేసారి 12 బ్లాక్ పాయింట్లు పడతాయి. ఒకవేళ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరంగా ఉండి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే, అధికా రులు వాహనాన్ని సీజ్ చేస్తారు. ఆ వాహనాన్ని తిరిగి విడిపించుకో వాలంటే యజమాని దాదాపు రూ. 12 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ కఠిన నిబంధనలు వినడానికి భారంగా ఉన్నప్పటికీ, రహదారులపై క్రమశిక్షణను పెంచడానికి ఇవి ఎంతో దోహదపడుతున్నాయి.

**గమనిక:** ట్రాఫిక్ నిబంధనలు కేవలం శిక్షల కోసం కాదని, అవి మన ప్రాణ రక్షణ కవచాలని గుర్తించాలి. డ్రైవింగ్ చేసేటప్పుడు ఏకాగ్రత పాటించడం వల్ల మనతో పాటు తోటి ప్రయాణికుల ప్రాణాలను కూడా కాపాడవచ్చు.

